
సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం । 23 । సెప్టెంబర్ । 2023



మారుమూల గ్రామాలకు రోడ్లు
మారుమూల గ్రామాలకు రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని రంపచోడవరం పీవో సూరజ్ గనోరే తెలిపారు. 8లో



క్రమశిక్షణతో మెలగాలి
విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ చర్యణ్‌రాజ్ సూచించారు. 8లో



గంజాయి స్వాధీనం
సీలేరు, ఎటపాక పోలీసులు 360 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 12 మందిని అరెస్టు చేశారు. 8లో

న్యూస్‌రీల్

నేటి నుంచి గుడిస సందర్శనకు అనుమతి

మారేడుమిల్లి : మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గుడిస హిల్‌టాప్ సందర్శనకు శనివారం నుంచి పర్యాటకులను అనుమతిస్తున్నట్టు మారేడుమిల్లి రేంజ్ అధికారి ఎస్‌ఏకే ఆజాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న కార్తీక మాసం దృష్టిలో పెట్టుకుని గుడిసలో పరిశుభ్రత, రహదారి నిర్మాణ పనుల దృష్ట్యా ఈనెల నాలుగో తేదీ నుంచి సందర్శకుల అనుమతి నిలిపివేశారు. పనులు పూర్తి కావడంతో శనివారం నుంచి యథావిధిగా అనుమతిస్తున్నట్టు రేంజ్ అధికారి తెలిపారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

మహారాణిపేట (విశాఖ): ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన నిర్వహిస్తున్నారు. ఒకటి నుంచి ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు ఉదయం 10 గంటల నుంచి 12 వరకు జరుగుతాయని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి (సీఈవో) పి.శ్రీరామ్మూర్తి తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సభ్యులు, అధికారులు హాజరు కావాలని సీఈవో కోరారు.

ఇగ్నో ప్రవేశాల గడువు పెంపు

ఎంవీపీకాలనీ (విశాఖ): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 2023 జులై ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తుల గడువును పొడిగించినట్టు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఇగ్నో ద్వారా అందిస్తున్న డిగ్రీ, పీజీ, ఎంబీఏ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ ప్రవేశాలు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరగనున్నాయి. కేంద్రం పరిధిలోని 5 జిల్లాల విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నారు. https:// ignouadmission.samarth.edu.in/ వెబ్‌సైట్ ద్వారా అర్హులైన విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 20 వరకు గడువు పొడిగించారు. పూర్తి వివరాలకు ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

- ఉద్యోగాలకు 42 మంది ఎంపిక



మాట్లాడుతున్న రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు

పాడేరు రూరల్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మినీ జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఇంటర్వ్యూలకు 132 మంది హాజరు కాగా 42 మంది ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు తెలిపారు. తొమ్మిది కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, ఉపాధి కల్పన అధికారి సంగీత, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రశాంత్ పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎల్పీవో రాఘవన్

రంపచోడవరం : స్థానిక మేజర్ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై విచారణ కొనసాగుతోందని డీఎల్పీవో రాఘవన్ తెలిపారు. శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి పంచాయతీలో రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ మూర్తి అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నామన్నారు. రికార్డుల తనిఖీ తరువాత నిధుల దుర్వినియోగం ఏమేర జరిగిందో నిర్ధారణ అవుతుందని చెప్పారు.

గిరి రైతుకు కలిసొచ్చిన రాజ్‌మా

- 90 శాతం రాయితీపై ముందుగానే విత్తనాల సరఫరా
- ప్రభుత్వ ప్రోత్సాహంతో గతేడాది మంచి ఆదాయం
- వాతావరణం అనుకూలంతో పైరు కళకళ



ఎరుపు రకం రాజ్‌మా విత్తనాలు



పాడేరు మండలం కుమ్మరిపుట్టులో కళకళలాడుతున్న రాజ్‌మా పైరు

సాక్షి,పాడేరు : ఏజెన్సీలో గిరి రైతుకు రాజ్‌మా సాగు లాభదాయకంగా మారింది. వాణిజ్య పంటగా ఎరుపు రకాన్ని సాగు చేస్తున్నారు. ప్రభుత్వం అన్నివిధాలుగా సహకారం అందించడంతో సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ప్రభుత్వం 90 శాతం రాయితీపై 18,212 ఎకరాలకు అవసరమైన 4,555 క్వింటాళ్ల రాజ్‌మా విత్తనాలను ఈ ఏడాది ముందుగానే పంపిణీ చేసింది. సేంద్రియ విధానంలో మెట్ట, కొండపోడు భూముల్లో సాగు చేపట్టారు. రాజ్‌మా విత్తనం కిలో అసలు ధర రూ.154 కాగా ప్రభుత్వం రూ.15.40కు పంపిణీ చేసింది. ఎకరాకు 20 కిలోల విత్తనం అవసరం. అందుకు తగ్గట్టుగానే ప్రభుత్వం సరఫరా చేసింది. ఈ సాగుపై సుమారు 7వేల మంది గిరి రైతులు ఆధారపడ్డారు.

గంజాయి సాగుకు ప్రత్యామ్నాయంగా..

గంజాయి సాగుకు ప్రత్యామ్నాయంగా పోలీసుశాఖ రాజ్‌మా సాగును ప్రోత్సహిస్తోంది. పెదబయలు, జి.మాడుగుల, ముంచంగిపుట్టు, జీకేవీధి, చింతపల్లి మండలాల్లోని మారుమూల గ్రామాల గిరిజనులు ఇప్పటికే విత్తనాలు పొంది సాగు చేపట్టారు. మెట్ట ప్రాంతంలో పండించే రాజ్‌మా సాగుకు వాతావరణ పరిస్థితులు అనుకూలించాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఎంతగానో మేలు చేశాయి. మొక్కదశలో పైరు కళకళలాడుతోంది. నవంబర్ నెలాఖరు నుంచి డిసెంబర్ మొదటి వారంలోగా పంట దిగుబడి రావొచ్చని గిరి రైతులు అంచనా వేస్తున్నారు.

రాయితీతో ఆదా



ప్రభుత్వం 90 శాతం రాయితీపై విత్తనాలు సరఫరా చేయడం వల్ల పెట్టుబడి పరంగా ఎంతో ఆదా అవుతోంది. ప్రైవేటు మార్కెట్‌లో కిలో రూ.120 నుంచి రూ.150కు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం రాయితీ మినహాయించి కిలో రూ.15.40కు సరఫరా చేసింది. 50 కిలోల విత్తనం పొందా. ప్రస్తుతం మూడు ఎకరాల్లో సాగు చేపట్టా.
– రేగం మంగ్లన్న, నేరేడివలస, గబ్బంగి, పాడేరు మండలం

దిగుబడి పెరిగే అవకాశం



రాజ్‌మా గింజలకు మార్కెట్లో మంచి ధర పలుకుతోంది. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. విత్తనాలు ముందుగానే సరఫరా చేయడంతో ఇప్పటికే చాలా చోట్ల సాగు చేపట్టారు. పైరు మొక్క దశలో కళకళలాడుతోంది. సేంద్రియ విధానంలో పండించడం వల్ల మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. మెరుగైన ధర లభించే అవకాశం ఉంది.
– ఎస్‌బీఎస్ నందు, జిల్లా వ్యవసాయాధికారి, పాడేరు



మన్యంలో అందాలకు కొదవలేదు. అనంతగిరి ఘాట్‌రోడ్డు మార్గంలో శుక్రవారం సూర్యోదయ వేళ ప్రకృతి అందాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సప్తవర్ణాలతో కనువిందు చేశాయి. అందుకే మన్యం అందాలను తిలకించేందుకు సీజన్‌తో సంబంధం లేకుండా పర్యాటకులు తరలి వస్తుంటారు. – అనంతగిరి

విద్యుదుత్పత్తిలో సీలేరు అగ్రగామి

ఏపీ జెన్‌కో డైరెక్టర్ (హైడల్) ఎండీ సత్యనారాయణ



గుంటవాడ రిజర్వాయరును పరిశీలిస్తున్న అధికారుల బృందం

సీలేరు: విద్యుత్ ఉత్పత్తిలో సీలేరు కాంప్లెక్సు అగ్రగామిగా నిలుస్తోందని ఏపీ జెన్‌కో డైరెక్టర్ (హైడల్) ఎండీ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన గోదావరి రివర్ బోర్డు చైర్మన్ ఎంకే సిన్హాతో కలిసి సీలేరు విద్యుత్ కాంప్లెక్సులో పర్యటించారు. బలిమెల, గుంటవాడ డ్యామ్‌లు, జల విద్యుత్ కేంద్రం, కొత్తగా నిర్మించబోయే పంప్‌డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో నిర్మించబోయే పంప్‌డ్ స్టోరేజ్ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు మాత్రమే రావాల్సి ఉందన్నారు. సీలేరు విద్యుత్ కాంప్లెక్సులో ఉత్పత్తి బాగానే ఉందన్నారు.

సమన్వయంతో బలిమెల నీటి వినియోగం

గోదావరి రివర్ బోర్డులో భాగంలో ఒకటైన సరిహద్దులో ఉన్న బలిమెల జలాశయంలో నీటిని ఇరు రాష్ట్రాలు సమన్వయంతో వాడుకుంటున్నట్టు గోదావరి రివర్ బోర్డు చైర్మన్ ఎంకే సిన్హా తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా నీటి వివాదాలు లేవని, ఈ ఏడాది బలిమెలలో నీటి నిల్వలు ఏపీ వాటాగా ఆశాజనకంగానే ఉన్నాయని అన్నారు. ఆ నీటితో విద్యుదుత్పత్తి చేస్తూ ఇరిగేషన్ అవసరాలకు కూడా వినియోగిస్తామన్నారు. సీలేరు జల విద్యుత్ కేంద్రం, గుంటవాడ రెగ్యులేటర్ డ్యాం నీటి మట్టాలను పరిశీలించారు. డ్యాం నిర్వహణ, భద్రత మరింత పెంచాలని సిబ్బందికి సూచించారు. పర్యటనలో వీరి వెంట చీఫ్ ఇంజినీరు శ్రీధర్, సూపరింటెండెంట్ ఇంజినీరు ప్రశాంత్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ప్రభాకర్‌రావు, బాబూరావు, అప్పలనాయుడు, రామకృష్ణ, సురేష్ పాల్గొన్నారు.

యూ.చీడిపాలెం డిప్యూటీ వార్డెన్ సస్పెన్షన్

- హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు
- విద్యార్థి మృతిపై స్పందించిన కలెక్టర్ సుమిత్‌కుమార్
- విచారణ నివేదిక ఆధారంగా చర్యలు

కొయ్యూరు: యూ. చీడిపాలెం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థి మృతికి నిర్లక్ష్యమే కారణమని తేలడంతో డిప్యూటీ వార్డెన్ మిరియాల రాజుబాబును కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం సస్పెండ్ చేశారు. హెచ్‌ఎం టి. నాగేశ్వరరావుకు షోకాజ్ నోటీసు ఇచ్చారు. వివరాలిలాఉన్నాయి. మండలంలోని యూ.చీడిపాలెం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో నాల్గో తరగతి చదువుతున్న కిలో వంశీకృష్ణ (10)కు జ్వరం రావడంతో ఈనెల 11న అక్కడి ఆస్పత్రికి తీసుకువెళ్లారు. నిర్వహించిన వైద్య పరీక్షల్లో మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. జ్వర తీవ్రత పెరగడంతో వైద్యాధికారి జయప్రకాష్ వై.రామవరం సీహెచ్‌సీకి తీసుకువెళ్లాలని సూచించారు. అయితే వార్డెన్ తీసుకువెళ్లలేదు. మరుసటిరోజు జ్వరం రావడంతో విద్యార్థిని మళ్లీ యూ.చీడిపాలెం ఆస్పత్రికి తీసుకువెళ్లారు. వై.రామవరం సీహెచ్‌సీకి ఎందుకు తీసుకువెళ్లలేదని వైద్యాధికారి ఆయనను మందలించారు. అయినా డిప్యూటీ వార్డెన్ రాజబాబు తీసుకువెళ్లలేదు. ఈ నేపథ్యంలో విద్యార్థి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఈనెల 14వ తేదీన తెల్లవారుజామున మృతి చెందాడు. వెంటనే మృతదేహాన్ని స్వగ్రామం గొందికోటకు తీసుకువెళ్లడంతో తండ్రి రాజ్‌కుమార్ బోరున విలపించాడు. డిప్యూటీ వార్డెన్‌పై ఆయన ఆగ్రహానికి గురయ్యారు. ఆరోగ్యం విషమిస్తే తమకు ఎందుకు చెప్పలేదని నిలదీశారు. ఈ ఘటనపై నిర్వహించిన విచారణలో డిప్యూటీ వార్డెన్ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించిందని ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్ తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు నివేదించడంతో సస్పెండ్ చేశారని ఆయన వివరించారు. హెచ్‌ఎం టి. నాగేశ్వరరావుకు షోకాజ్ నోటీసు జారీ అయిందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థి మృతిపై బాలల హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు వెళ్లింది.

సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి



అనంతనాయక్‌కు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఆలయ కమిటీ



గిరి రైతుకు ఆర్వోఎఫ్‌ఆర్ పట్టాను పంపిణీ చేస్తున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు అనంతనాయక్

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు అనంతనాయక్
- పాడేరులో పర్యటన
- మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు

సాక్షి,పాడేరు: గిరిజన సంస్కృతి సంప్రదాయాలు, భాషను పరిరక్షించుకోవాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు అనంతనాయక్ కోరారు. శుక్రవారం పాడేరు విచ్చేసిన ఆయనకు కలెక్టర్ సుమిత్ కుమార్,ఐటీడీఏ పీవో అభిషేక్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు లిల్లీ, అధికారులు, బీజేపీ నేతలు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం మోదకొండమ్మ ఆలయంలో పూజలు చేశారు.ఆలయ కమిటీ,బీజేపీ నేతలు ఆయనను సత్కరించి, అమ్మవారి ఫొటోను అందజేశారు.

స్టాళ్ల పరిశీలన

శ్రీకృష్ణాపురం బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించిన అనంత్‌నాయక్ ఐటీడీఏ, జీసీసీ, కాఫీ విభాగం, వన్‌ధన్ వికాస్‌లకు సంబంధించిన స్టాళ్లను పరిశీలించారు. జిల్లాలో కాఫీసాగు, కాఫీ గింజల ఉత్పత్తి, మార్కెటింగ్, గిరిజనులు పొందుతున్న ఆదాయంపై ఆయన సమీక్షించారు. కలెక్టర్ సుమిత్ కుమార్ పాడేరు డివిజన్‌లోని 113 వన్‌ధన్ యోజన కేంద్రాల సమాచారాన్ని ఆయనకు వివరించారు.

డీఫారం పట్టాలు, భూహక్కు పత్రాల పంపిణీ

గిరిజన రైతులకు 160 ఎకరాలకు సంబంధించి డీఫారం పట్టాలు, 30 మందికి అటవీ భూహక్కు పత్రాలను అనంత్‌నాయక్ పంపిణీ చేశారు. శ్రీకృష్ణాపురం పాఠశాల బాలికలతో ఆయన ముచ్చటించారు.విద్యా కార్యక్రమాలు, సౌకర్యాలు బాగున్నాయని వారంతా చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ కార్యక్రమాలను కలెక్టర్ వివరించారు. జలియన్ వాలాబాగ్ సంఘటనపై గిరిజన విద్యార్థినులను ఆయన ఒడియా భాషలో ప్రశ్నించారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో వెయ్యి మంది గోండు గిరిజనులు ప్రాణాలు అర్పించారని ఆయన విద్యార్థినులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జేసీ శివశ్రీనివాస్, ఏఎస్పీ అనిల్, ఐటీడీఏ ఏపీవోలు వెంకటేశ్వరరావు, ప్రభాకరరావు, గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు, కేంద్ర కాఫీబోర్డు సభ్యుడు కురుసా ఉమామహేశ్వరరావు, టీసీఆర్‌అండ్‌టీఐ అధికారి జి.చినబాబు, ఎస్టీ కమిషన్ అధికారులు పి.కె.పరీడా, జయంత్ జే.సరోడే, రాధాకాంత త్రిపాఠి, వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షురాలు సరస్వతి, సర్పంచ్‌లు మఠం శాంతకుమారి, లకే పార్వతమ్మ, జీసీసీ రిటైర్డ్ డీఎం కురుసా పార్వతమ్మ, బీజేపీ అరకు పార్లమెంట్ నేత పాంగి రాజారావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్, ఐటీడీఏ పీవోలతో థింసా నృత్యం చేస్తున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు అనంతనాయక్

సరిహద్దుల్లో అప్రమత్తంగా ఉండండి

- కూంబింగ్ ముమ్మరం
- ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశం



ఆదివాసీలతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా



కలెక్టరేట్‌లో బాంబు స్క్వాడ్ తనిఖీలు

చింతూరు: సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ తుహిన్‌సిన్హా సూచించారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఆయన సరిహద్దుల్లో తీసుకుంటున్న రక్షణచర్యల వివరాలను తెలుసుకున్నారు. మావోయిస్టులు వారోత్సవాలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో తమ ఉనికిని చాటుకునేందుకు సరిహద్దు ప్రాంతాల్లో ఏవైనా ఘటనలకు పాల్పడే అవకాశాలున్నాయి. అందువల్ల సరిహద్దు ప్రాంతాల్లో ముమ్మరంగా కూంబింగ్ నిర్వహించాలని ఆయన ఆదేశించారు. మండలంలోని కొత్తూరుకు చెందిన వలస ఆదివాసీలు ఎస్పీని కలిసారు. తమ గ్రామానికి విద్యుత్, తాగునీరు, భూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని వారు కోరారు. దీనిపై స్పందించిన ఆయన సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీఐ అప్పలనాయుడు, ఎస్‌ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో..

జి.మాడుగుల: మావోయిస్టు పార్టీ ఆవిర్భావ వారోత్సవాల నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. వారి కదలికలను పసిగట్టేందుకు ఎలక్ట్రానిక్ డివైస్, డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. సరిహద్దు రాష్ట్ర అటవీ ప్రాంతాల్లో సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తున్నారు. పాడేరు–జి.మాడుగుల, చింతపల్లి, నుర్మతి, మద్దిగరువు మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి విడిచిపెడుతున్నారు. అనుమానితులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్‌ఐ శ్రీనివాస్ కోరారు.

బాంబు స్క్వాడ్ తనిఖీలు

సాక్షి,పాడేరు: మావోయిస్టు పార్టీ ఆవిర్భావ వారోత్సవాల నేపథ్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద బాంబు స్క్వాడ్ తనిఖీలు నిర్వహించింది. కలెక్టరేట్, పాడేరు ఐటీడీఏ పీఎంఆర్‌సీ భవనంతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ అతిథి గృహాలు, ముఖ్యమైన అధికారుల నివాసాల్లో విస్తృత తనిఖీలు చేపట్టింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉన్నామని పాడేరు సీఐ సుధాకర్ తెలిపారు.



జి.మాడుగుల–చింతపల్లి రోడ్డులో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు



డ్రోన్‌ను ఆపరేట్ చేస్తున్న జి.మాడుగుల ఎస్‌ఐ శ్రీనివాస్

25, 26 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిస్టర్ షైజీ, పీకే జయలక్ష్మి

కంచరపాలెం (విశాఖ): జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో హిందీ సాహిత్య భారతీ సౌజన్యంతో ఈ నెల 25, 26 తేదీల్లో భారతీయ సాహిత్యం, ఆధ్యాత్మికత అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ బహుభాషా సదస్సు నిర్వహించనున్నట్లు కన్వీనర్, ద్వితీయ భాషా విభాగ అధ్యక్షుడు డాక్టర్ పి.కె.జయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కళాశాల సెమినార్ హాల్‌లో సదస్సు వాల్‌పోస్టర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ఆవిష్కరించారు. అనంతరం ప్రిన్సిపాల్ షైజీ మాట్లాడుతూ కొరియా, సౌత్ ఆఫ్రికా నుంచి వక్తలతో పాటు ఏయూ తెలుగు విభాగ పూర్వ ఆచార్యుడు వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి, హిందీ సాహిత్య భారతి వ్యవస్థాపకుడు ఉత్తరప్రదేశ్ పూర్వ విద్యాశాఖా మంత్రి డాక్టర్ రవీంద్ర శుక్ల సాహితీ వాచస్పతి, డాక్టర్ డి.వి.సూర్యారావు, డాక్టర్ సుమన్‌లత కీలక ప్రసంగాలు చేయనున్నట్టు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని జయలక్ష్మి సూచించారు. వివరాలకు ఫోన్ నంబర్ 92473–62689లో సంప్రదించాలన్నారు.

నిండు గర్భిణికి ఎన్ని కష్టాలో..

- అర్ధరాత్రి వేళ టార్చ్‌లైట్ల వెలుగులో డోలీలో తరలింపు



టార్చ్‌లైట్ల వెలుగులో గర్భిణిని డోలీలో తరలిస్తున్న కుటుంబ సభ్యులు

ముంచంగిపుట్టు: నిండుగర్భిణికి పురిటినొప్పులు అధికమయ్యాయి. అర్ధరాత్రి రాత్రి కావడంతో కుటుంబ సభ్యులు టార్చ్‌లైట్ల వెలుగులో డోలీలో తరలించాల్సి వచ్చింది. మండలంలోని ఏనుగురాయి పంచాయతీ కిమ్మలమామిడి గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నిండు గర్భిణి శైలజకు గురువారం అర్ధరాత్రి పురిటినొప్పులు అధికమయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను ఆస్పత్రికి తరలించేందుకు అష్టకష్టాలు పడ్డారు. టార్చ్‌లైట్ల వెలుగులో సుమారు రెండు కిలోమీటర్లు డోలీలో రోడ్డు వరకు మోసుకొని వచ్చారు. అక్కడ నుంచి ప్రైవేటు వాహనంలో స్థానిక సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. వైద్యసిబ్బంది సకాలంలో స్పందించి సేవలందించడంతో ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కిమ్మలమామిడి గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మన్యంలో ఎంపీడీవోల బృందం

- శిక్షణలో భాగంగా సందర్శన
- థింసా నృత్యంతో సందడి



శిక్షణ నిమిత్తం వచ్చిన ఎంపీడీవోల బృందంతో ఎంపీపీ శెట్టి నీలవేణి

అనంతగిరి: శిక్షణలో భాగంగా 30 మందితో కూడిన ఎంపీడీవోల బృందం శుక్రవారం మన్యంలో పర్యటించింది. దీనిలో భాగంగా ముందుగా మండలంలోని చిలకలగెడ్డ సచివాలయం వద్ద గిరిజనులతో మమేకమయ్యారు. బృందం సభ్యులకు ఎంపీపీ శెట్టి నీలవేణి స్వాగతం పలికారు. కొంతసేపు మండల అభివృద్ధిపై చర్చించారు. అనంతరం బొర్రాగుహలను తిలకించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గిరిజనులతో కలిసి థింసా నృత్యంచేశారు. అభివృద్ధి, మౌలికవసతుల వివరాలను బృందం సభ్యులు గిరిజనుల నుంచి తెలుసుకున్నారు. ఎంపీడీవోలు శ్రీహర్షిత్, కుమార్ తదితరులు బృందంలో ఉన్నారు.

క్లుప్తంగా

జాబ్‌మేళాలో 121 మంది ఎంపిక

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్) తెలిపారు. వాల్ మార్ట్, బిగ్ సీ మొబైల్స్, మెడ్ ప్లస్, బిగ్ బాస్కెట్, టీం లీజ్, యూనియన్ బ్యాంక్, మహాదేవ్ షిప్పింగ్, శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీలో మొత్తం 695 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 237 మంది అభ్యర్థులు హాజరుకాగా..121 మంది ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించి, సుబ్బిరెడ్డి చేతులు మీదుగా నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రైవేటు కంపెనీలను ప్రోత్సాహించడంతో ఆయా కంపెనీలు నేరుగా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు.

విమ్స్‌కు 27 మంది కొత్త వైద్యులు

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)కు 27 మంది కొత్త వైద్యులు రానున్నారు. ఈనెల 21న విమ్స్‌లో 43 మంది సూపర్ స్పెషాలిటీ, జనరల్ వైద్యుల నియామకానికి ఏపీ మెడికల్ బోర్డు ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ మేరకు 12 మంది సూపర్ స్పెషాలిటీ, 15 మంది జనరల్ వైద్యులున్నట్లు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు శుక్రవారం తెలిపారు. ఇంటర్వ్యూలకు 65 మంది హాజరయ్యారన్నారు. రోస్టర్ పాయింట్లు సరిపడక అవసరమైన మరో 16 మందిని ఎంపిక చేయడానికి వీలుపడలేదన్నారు. నివేదిక ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

దోమల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి


గంగవరం ఆశ్రమ పాఠశాల వద్ద గంబూషియా చేప పిల్లలను విడుదల చేస్తున్న దృశ్యం


తుంగమడుగులలోని చెరువులో గంబుజియా చేప పిల్లలను విడిచిపెడుతున్న అధికారులు


దూసరపాములో గంబూషియా చేపలు వదిలిపెడుతున్న డాక్టర్ లిఖిత, సర్పంచ్ శివ


దాలిపాడులో గంభూషియ చేపల పిల్లలను విడిచిపెడుతున్న వైద్య సిబ్బంది

గంగవరం: దోమల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని గంగవరం, పిడతమామిడి పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ భావన, డాక్టర్ సాయిరతన్ చెప్పారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికొన్నత పాఠశాల పరిసరాల్లోని నీటి నిల్వ ఉన్న గుంతల్లో దోమల నివారణకు గాను గంబూషియా చేప పిల్లలను విడుదల చేశారు. దోమల లార్వాను గంబూషియా చేప పిల్లలు ఆహారంగా తీసుకుంటాయని, ఫలితంగా దోమల ఉత్పత్తి తగ్గుతుందన్నారు. నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు అమలు చేయాలని పంచాయతీ సిబ్బంది సూచించారు. దోమల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గంగవరం, పిడతమామిడి పిహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. స్థానిక ఆశ్రమపాఠశాల హెచ్ఎం ఝాన్సీహేన్సన్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సూరిబాబు, మలేరియా వైద్య సిబ్బంది శ్రీనివాస్, అప్పలస్వామి, యోహాన్, గ్రామ వలంటీర్ శ్రీనుబాబు పాల్గొన్నారు.

అడ్డతీగల: మండలంలోని ఎల్లవరం, దుప్పలపాలెం వైద్యాధికారులు భాస్కర్, స్పందన ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల్లోని నీటి గుంతల్లో గంబూషియా చేప పిల్లలను విడుదల చేశారు. మండలంలోని రెండు పిహెచ్‌సిల పరిధిలో డొక్కపాలెం, తుంగమడుగుల, శెట్టిపల్లి, చాపరాతిపాలెం గ్రామాల్లోని చెరువుల్లో గంబుజియా చేప పిల్లలను విడిచిపెట్టినట్లు మలేరియా విభాగ సబ్‌యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గంబుజియా చేప పిల్లలను విడిచి పెట్టామన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని బడదనాంపల్లి, దూసరపాము, సింగంపల్లి, జడ్డంగి పీహెచ్‌సీ పరిధిలో ఉర్లాకులపాడు, లాగరాయి పీహెచ్‌సీ పరిధిలో లబ్బర్తి, చీడిపాలెం గ్రామాల్లోని నిల్వ నీటి గుంతల్లో గంబూషియా చేప పిల్లలను వదిలిపెట్టినట్టు అసిస్టెంట్ మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వర్రావు చెప్పారు. దోమల నివారణకు కృషి జరుగుతోందన్నారు. దూసరపాములో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ లిఖిత, సర్పంచ్ చీడి శివ, సబ్ యూనిట్ ఆఫీసర్లు రామకృష్ణ, చీడిపల్లి ప్రసాద్, ఏఎన్ఎం సుజాత, హెచ్ఏ లక్ష్మణ్ పాల్గొన్నారు.

వై.రామవరం: మండలంలోని వై.రామవరం, పనసలపాలెం, పూతిగుంట, దాలిపాడు, రేగడిపాలెం, కె.యర్రగొండ, యర్రంరెడ్డిపాలెం, మనసలపాలెం గ్రామాల్లోని చెరువుల్లో గంబూషియా చేప పిల్లలను మలేరియా టెక్నీషియన్ పల్లాల కృష్ణారెడ్డి, చవిటిదిబ్బలు పీహెచ్‌సీ వైద్యాధికారులు దినేష్, నరేంద్రల ఆధ్వర్యంలో వదిలారు. మలేరియ సిబ్బంది, గ్రామ సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

25 నుంచి ఉమ్మడి విశాఖ జిల్లా క్రీడా జట్ల ఎంపిక

చోడవరం రూరల్: ఉమ్మడి విశాఖ జిల్లా అండర్-19 క్రీడా జట్ల ఎంపిక పోటీలు వివిధ కళాశాలలు, వేదికలలో ఈ నెల 25 నుంచి నిర్వహించనున్నట్టు జూనియర్ కాలేజీల గేమ్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గోతిరెడ్డి రాంబాబు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వివిధ క్రీడాంశాలకు సంబంధించి జట్ల ఎంపిక 25 నుంచి వచ్చేనెల 7వ తేదీ వరకు జరుగుతుందని చెప్పారు. ఈ మేరకు జిల్లా సెలక్షన్స్ షెడ్యూల్‌ను శుక్రవారం ఆయన పత్రికలకు విడుదల చేశారు. 2005 జనవరి ఒకటి తర్వాత జన్మించినవారు, స్టూడెంట్ ఐడీ నంబర్, అడ్మిషన్ నంబర్‌లతో సహా ఆయా విద్యాసంస్థల అధిపతుల ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉన్నవారు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాలలో ఈనెల 25న అథ్లెటిక్స్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, 26న క్రికెట్, ఖో-ఖో జట్ల ఎంపిక జరుగుతుందని, అదే రోజు కొయ్యూరు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో రెజ్లింగ్ జట్లను ఎంపిక చేస్తారని చెప్పారు. 27న విశాఖ ఏయూ గ్రౌండ్స్‌లో లాన్ టెన్నిస్, టౌన్ కొత్తరోడ్ మున్సిపల్ స్టేడియంలో ఫుట్‌బాల్, హ్యాండ్ బాల్, టేబిల్ టెన్నిస్, నెట్ బాల్, బ్యాడ్మింటన్ జట్లను ఎంపిక చేస్తారు. 29న విశాఖ ఏయూ గ్రౌండ్స్‌లో బాక్సింగ్ క్రీడాకారుల సెలక్షన్స్ జరుగుతాయి. 30న సబ్బవరంలోని ఏపీ సాంఘిక సంక్షేమ జూనియర్ కళాశాలలో క్యారమ్స్, చెస్, యోగా, జిమ్నాస్టిక్స్ జట్ల ఎంపిక జరుగుతుంది. అక్టోబర్ 3న విశాఖ శ్రీకృష్ణాపురం సాంఘిక సంక్షేమ కళాశాలలో బేస్‌బాల్, ఆర్చరీ, రోప్ స్కిప్పింగ్, ఫెన్సింగ్, షూటింగ్‌లలో ఎంపిక జరుగుతుంది. వచ్చేనెల 4న నక్కపల్లి జూనియర్ కళాశాలలో హాకీ జట్టు, 5న విశాఖ పోర్టు హైస్కూల్ గ్రౌండ్‌లో టార్గెట్ బాల్, పోర్టు స్టేడియంలో బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక, 6న గాజువాక బ్యూలా స్కూల్‌లో కరాటే, జూడో, తైక్వాండో జట్లకు, 7న విశాఖ ఉడా పార్కులో స్కేటింగ్, స్వర్ణ భారతి స్టేడియంలో స్విమ్మింగ్ జట్ల ఎంపిక జరుగుతుందని రాంబాబు తెలిపారు. మరిన్ని క్రీడాంశాలకు సంబంధించి ఎంపిక తేదీల వివరాలను, వివిధ పోటీలకు సంబంధించి మార్పులు జరిగినా తెలియజేస్తారు. ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆయా తేదీల్లో ఉదయం 10గంటలకు నిర్దేశిత మైదానాలకు చేరుకోవాలన్నారు.

అనారోగ్యంతో గురుకుల విద్యార్థి మృతి

- మృతదేహాన్ని జామిగుడ గెడ్డ దాటించేందుకు అవస్థలు


చంద్రకిరణ్ (ఫైల్)

పెదబయలు: మండలంలోని జామిగుడ సర్పంచ్ తెరవాడ చిన్నమ్మ కుమారుడు తెరవాడ చంద్రకిరణ్ (13) అనారోగ్యంతో విశాఖపట్నం ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఈ విషయాన్ని అతని విద్యార్థి తండ్రి తెరవాడ వెంకటరావు తెలిపారు. చంద్ర కిరణ్ విశాఖపట్నం జిల్లా మారికవలస గిరిజన సంక్షేమ బాలూర పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. అయితే గత 15 రోజుల నుంచి ఆరోగ్యం బాగు లేకపోవడంతో ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందిస్తున్నామని, పరిస్థితి విషమించడంతో గురువారం అర్ధరాత్రి మృతి చెందినట్టు తండ్రి వెంకటరావు తెలిపారు. ఇలావుండగా వెంటనే మృతదేహాన్ని అంబులెన్స్‌లో జామిగుడ వరకు తరలించారు. అక్కడి నుంచి చింతలవీధి గ్రామం వెళ్లేందుకు మధ్యలో గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అవరోధంగా మారింది. అతికష్టం మీద మృతదేహం గెడ్డ దాటించి శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు.

25 నుంచి పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం: విజయవాడ డివిజన్ బాపట్ల స్టేషన్ పరిధిలో జరుగుతున్న ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా ఈ మార్గంలో నడిచే పలు రైళ్లను ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేరు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. బోకారో ఎక్స్‌ప్రెస్‌ను ఆయా తేదీల్లో దారి మళ్లిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ మార్పును గమనించి సహకరించాలని కోరారు.

ఈ నెల 25, అక్టోబర్ 2, 9 తేదీల్లో విశాఖపట్నం-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (22869) వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 26, అక్టోబర్ 3, 10 తేదీల్లో ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-విశాఖపట్నం (22870) వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 27, అక్టోబర్ 4వ తేదీల్లో సంబల్‌పూర్-ఈరోడ్ (08311) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 29, అక్టోబర్ 6వ తేదీల్లో ఈరోడ్-సంబల్‌పూర్ (08312) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 24, అక్టోబర్ 1, 8 తేదీల్లో విశాఖపట్నం-బెంగళూరు కంటోన్మెంట్ (08543) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 25, అక్టోబర్ 2, 9 తేదీల్లో బెంగళూరు కంటోన్మెంట్-విశాఖపట్నం (08544) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు. అక్టోబర్ 4, 6, 8 తేదీల్లో తిరుపతి-విశాఖపట్నం (22708) డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్, 5, 7, 9 తేదీల్లో విశాఖపట్నం-తిరుపతి (22707) డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 30, అక్టోబర్ 7వ తేదీల్లో భువనేశ్వర్- తిరుపతి(02809)ఏసీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 1, 8 తేదీల్లో తిరుపతి-భువనేశ్వర్ (02810) ఏసీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 8న భువనేశ్వర్-తిరుపతి (22871) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 9న తిరుపతి-భువనేశ్వర్ (22872) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు తెలిపారు.

బొకారో ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు : ధన్‌బాద్-అలెప్పి(13351) బొకారో ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 2 నుంచి 10వ తేదీ వరకు రెగ్యులర్ మార్గంలో కాకుండా మళ్లించబడిన మార్గంలో వయా నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా రాకపోకలు సాగిస్తుంది. ఈ రైలు ఆయా తేదీల్లో తాడేపల్లిగూడెం, ఏలూరు మీదుగా ప్రయాణించదు.

సోషల్ మీడియా మాయలో పడొద్దు


విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న నాన్సీ ప్రీత్ కౌర్

పెదగంట్యాడ : సామాజిక మాధ్యమాల మాయలో పడి మనిషి మనుగడ కోల్పోకూడదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) జాతీయ సమన్వయకర్త డాక్టర్ నాన్సీ ప్రీత్ కౌర్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ తరగతులలో ముఖ్య వక్తగా పాల్గొన్నారు. సామాజిక మాధ్యమాల ఉచ్చులో పడి యువత ఆర్థికంగా, ఆరోగ్యపరంగా, మానసికంగా ఇక్కట్లకు గురవుతున్నారన్నారు. ఇన్నా సురక్ష పథకంలో భాగంగా ఐదు రాష్ట్రాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులకు సామాజిక మాధ్యమాల ప్రభావం సమాజంపై ఎలా ఉందనే విషయంపై అవగాహన కల్పించారు. వలంటీర్ అసోసియేషన్ ఇండియా ముఖ్య నిర్వాహణ అధికారి ఆచార్య భావనా మాట్లాడుతూ రాష్ట్రంలో 15 పాఠశాలలను ఎంపిక చేసుకుని ప్రయివేట్ ప్రాజెక్టుగా దీనిని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఇస్మాయిల్, సతీష్, ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకోండ శ్రీనివాస్, నారాయణ, మంగమ్మ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

మారుమూల గ్రామాలకు రోడ్లు

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

మారేడుమిల్లి : గిరిజన ప్రాంతంలోని మారుమూల గ్రామాలకు రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని బంద, వై.రామవరం మండలం కానివాడ గ్రామాలను సందర్శించారు. ఉపాధి హామీ పథకంలో రూ. 4.5 కోట్లతో చేపట్టిన బంద- కానివాడ సీసీరోడ్డు, బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. రెండు నెలలలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఘాట్ రోడ్డులోని మూడు కిలోమీటర్లు రోడ్డుకు ఇరువైపులా రాతి కట్టడాలు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. బంద గ్రామంలో జలజీవన్ మిషన్ పనులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, పిల్లలకు అందిస్తున్న ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. గ్రామంలో కొండ రెడ్ల గిరిజనుల ఇళ్లను సందర్శించారు. పోడు పట్టాల వివరాలు తెలుసుకున్నారు. సాగు చేస్తున్న పంటను పీవో పరిశీలించారు. ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఆయన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అనేది తెలుసుకున్నారు. కానివాడ పంచాయతీలో రైతులకు ఉద్యానవన పంటల సాగుకు ఏ ఏ మొక్కలు కావాలో లిఖిత పూర్వకంగా దరఖాస్తు చేసుకోవాలని ఆదేశించారు. రబ్బరు ప్లాంటేషన్ రైతులకు శిక్షణ ఇస్తామని కానివాడ గిరిజనులకు తెలిపారు. గిరిజనులు పలు సమస్యలను పీవో దృష్టికి తీసుకువచ్చారు. వీటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

క్రమశిక్షణతో మెలగాలి

- సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియన్ కమాండెంట్ చర్యణ్‌రాజ్
- విద్యార్థులకు వాలీబాల్ పోటీలు


గెలిచిన జట్టుతో అసిస్టెంట్ కమాండెంట్ చర్యణ్‌రాజ్

పెదబయలు : విద్యార్థులు ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి క్రమశిక్షణతో మెలగాలని దేశ భక్తిని పెంపొందించుకోవాలని సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ పి.చర్యణ్‌రాజ్ సూచించారు.శుక్రవారం స్థానిక గిరిజన సంక్షేమ బాలూర ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ పాటిస్తూ చదువులో రాణించాలన్నారు. ప్రభుత్వం అందించిన సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అలాగే ప్రాథమిక పాఠశాల స్థాయి ప్రతీ విద్యార్థి లక్ష్యంతో ముందుకు సాగాలని కోరారు. వాలీబాల్ పోటీల విజేతకు బహుమతులు అందజేశారు. సేవల్లో సీఆర్‌పీఎఫ్ పోలీసులు ముందుంటారన్నారు. విజేత జట్టుకు వాలీబాల్, నెట్ అందించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు సాధురాం పాల్గొన్నారు.

పేటీఎంతో స్త్రీనిధి రుణాల చెల్లింపులు

ఏజీఎం కామరాజు


అవగాహన కల్పిస్తున్న ఏజీఎం కామరాజు

రాజవొమ్మంగి : మండల కేంద్రంలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సీసీలు, వీఓఏలతో స్త్రీ నిధి ఏజీఎం కామరాజు శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా తీసుకొన్న స్త్రీనిధి రుణాలను మహిళా సంఘాలు ఇకపై పీటీఎం ద్వారానే చెల్లించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా రాజవొమ్మంగి మండలాన్ని ఎంచుకొన్నామన్నారు. మండలానికి కొత్త పీటీఎం మిషీన్‌ను అందజేశారు. స్వయం సహాయ సంఘాలు, గ్రామసమాఖ్యలు (వీఓ) ప్రతి నెల చెక్ రూపంలో స్త్రీ నిధి రుణాలు చెల్లింపులు జరిగేవని, ఇకపై పీటీఎం ద్వారా ఎంతో సులువుగా చెల్లించుకోవచ్చన్నారు. పీటీఎం ద్వారా చెల్లిస్తే రెండు మూడు గంటల్లోనే సొమ్ము స్త్రీ నిధికి జమ అవుతుందని, చెల్లింపు అయినట్టు సమాచారం పొందవచ్చన్నారు. దీంతో ఎటువంటి అవకతవకలకు తావులేకుండా ఉంటుందన్నారు. పేద ప్రజల జీవనోపాదుల మెరుగుకు స్త్రీ నిధి రుణాలు ఎంతో ఉపయోగ పడతాయన్నారు.

రూ.40కోట్లు రుణాలు లక్ష్యం: జిల్లా వ్యాప్తంగా 22 మండలాల్లోని స్వయం సహాయ సంఘాలకు రూ. 40 కోట్లు స్త్రీ నిధి రుణాలు ఇవ్వాలని లక్ష్యం కాగా ఇప్పటి వరకు రూ. 14 కోట్లు అందజేసినట్టు ఏజీఎం కామరాజు అన్నారు. ఆయన మాట్లాడుతు మరో రూ.6 కోట్ల మేర స్త్రీనిధి రుణాలు జనరేట్ చేసి నెలాఖరు వరకు నిర్దేశించిన టార్గెట్ పూర్తి చేస్తామన్నారు. రికవరీ విషయంలో 22 మండలాల్లో ఈ నెలాఖరుకు రూ. 3.26 కోట్లు మేర రుణ బకాయిలు ఉండగా, ఈ నెలాఖరుకు మరో కోటి రూపాయలు వసూలు చేస్తామన్నారు. ఈ మేరకు బుక్‌కీపర్లు (వీఓఏలు) బాధ్యతగా పనిచేసి రికవరీ లక్ష్యం పూర్తి చేయాలని కోరారు. ప్రస్తుతం రికవరీ శాతం 74.97గా ఉందని, దీనిని 80 శాతానికి పెంచాల్సిన బాధ్యత మీపై వుందని వీవోఏలకు సూచించారు. స్త్రీనిధి అడ్డతీగల క్లస్టర్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, ఏపీఎం ఆదినారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం


పురుషోత్తపట్టణం వద్ద గంజాయితో పట్టుబడిన నిందితులు

సీలేరు: జీకే వీధి మండలం సీలేరు పరిసర ప్రాంతాల నుంచి మైదాన ప్రాంతానికి తరలిస్తున్న 350 కిలోల గంజాయిని స్థానిక పోలీసులు పట్టుకున్నట్టు ఏఎస్పీ ప్రశాంత్ శివకిశోర్ శుక్రవారం తెలిపారు. సీలేరు పరిసర ప్రాంతాల్లో కొనుగోలుచేసి, వ్యాన్‌లో మహారాష్ట్రకు తరలిస్తుండగా వాహన తనిఖీల్లో గంజాయి బయటపడిందని చెప్పారు. గంజాయిని స్వాధీనం చేసుకుని ఏడుగురు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు ఏఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ రామృకృష్ణ పాల్గొన్నారు.

పురుషోత్తపట్టణం చెక్‌పోస్టు వద్ద..

ఎటపాక: ఒడిశా నుంచి హైదరాబాదుకు తరలిస్తున్న పది కిలోల గంజాయిని ఎటపాక పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఎస్ఐ పార్థసారథి తెలిపిన వివరాల ప్రకారం..ఐదుగురు వ్యక్తులు పురుషోత్తపట్టణం చెక్‌పోస్టు సమీపంలో రెండు సంచులతో సంచరిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించి, వారి వద్ద సంచుల్లో ఉన్న పది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బస్సులో గంజాయితో ప్రయాణిస్తూ భద్రాచలం సరిహద్దుల్లో తెలంగాణ పోలీసులు తనిఖీలు చేస్తున్నారనే సమాచారంతో పురుషోత్తపట్టణం చెక్ పోస్టు సమీపంలో బస్సు దిగిపోయారు. సంచులను దారి పక్కన పొదల్లో ఉంచి రాత్రి సమయంలో పట్టణం దాటించాలనే ఆలోచనలో ఉండగా కొందరి సమాచారంతో వీరు పోలీసులకు చిక్కారు.

గ్రామాల్లోనూ అభివృద్ధి పనులు


సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్ జేఈ రామకృష్ణారెడ్డి

కూనవరం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పాయం రంగమ్మ అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మండలంలోని పలు అభివృద్ధి పనులకు సంబంధించిన అంశంపై పీఆర్ జేఈ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ఆర్ నిధులతో ద్వారా 16 పంచాయతీలలో కొత్తరోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు.ఈ మేరకు డ్వామా పీడీకి రహదారుల పనుల ప్రతిపాదనలు పంపించామన్నారు. చినార్కూరు సచివాలయం ప్రారంభానికి సిద్ధంగా ఉందని, జగ్గవరం, కరకగూడెం సచివాలయాలు పూర్తి కావచ్చాయన్నారు. శివారు గ్రామాల్లోనూ రహదారుల పనులు జరుగుతున్నాయన్నారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ టేకులబోరు- కోండ్రాపేట మీదుగా చట్టి వరకు, కరకగూడెం-బోదునూరు, చినార్కూరు సచివాలయం- బోదునూరు గ్రామాల వరకు రోడ్లు నిరించాలని ఎంపీటీసీలు సూచించారు. కోతులగుట్ట, కూనవరం పీహెచ్‌సీలలో వైద్యులు నియమించాలని కోరారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. తాగునీటి పైపులైన్ కొత్తగా ఏర్పాటు చేయాలని ఎంపీపీ పాయం రంగమ్మ సూచించారు. జెడ్పీటీసీ గుజ్జా విజయ, ఎంపీడీవో ప్రేమ్ సాగర్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన శిక్షణతో మెరుగైన భద్రత

డీఐజీ రాజకుమారి


శిక్షణ కేంద్రంలో పర్యటిస్తున్న డీఐజీ రాజకుమారి, అధికారులు

పీఎంపాలెం: జీవీఎంసీ 6వ వార్డు బక్కన్నపాలెంలోని ఏపీఎస్‌పీ పోలీస్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం డీఐజీ రాజకుమారి సందర్శించారు. బెటాలియన్ నిర్వహణ, పోలీస్ శిక్షణ తదితర అంశాలపై 16వ పోలీస్ బెటాలియన్ కమాండర్ గౌతమీ శాలితో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యమైన శిక్షణతో ప్రజలకు మెరుగైన రక్షణ, భద్రత సేవలు అందించగలమన్నారు. అడిషనల్ కమాండెంట్ శ్యామ్యూల్ జాన్, అసిస్టెంట్ కమాండెంట్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.